క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన రహదారి వెంట అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని తహసీల్దార్ సుజాత తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్‌కు రూ.5వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అనుమతుల్లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైద్యశిబిరం

తానూరు: మండలకేంద్రంలోని విద్యా విలీన కేంద్రంలో మంగళవారం ఫిజియోథెరఫి వైద్య శిబిరం నిర్వహించారు. 24 మంది దివ్యాంగులైన పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించినట్లు ఫిజియోథెరపిస్టు శ్రీనివాస్ తెలిపారు. ఐఈఆర్‌టీలు భూమన్న, రాము, పిల్లల పోషకులు ఉన్నారు.

ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలి



లైసెన్సు అందిస్తున్న కార్యదర్శి రాజబాపు

కుంటాల: దుకాణదారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని పంచాయతీ కార్యదర్శి రాజబాపు పేర్కొన్నారు. మంగళవారం కుంటాలలో యజమానులకు లైసెన్సులను అందజేశారు. ట్రేడ్ లైసెన్సులున్నవారు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హులని సూచించారు. ఆయన వెంట సిబ్బంది దిలీప్ ఉన్నారు.

ఇసుక డంపు పట్టివేత



డంపుల వద్ద ఎస్సై సుమలత, ఆర్‌ఐ

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామ సమీపంలో నిల్వ చేసిన ఇసుక కుప్పలను రెవెన్యూ, పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. మూడు ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసి తదుపరి చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించినట్లు తహసీల్దార్ జానకి తెలిపారు. ఇందులో ఎస్సై సుమలత, ఆర్‌ఐ నరేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ



భోజనం పరిశీలిస్తున్న తహసీల్దార్

దస్తురాబాద్: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పదోతరగతి విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆందోళన చెందకుండా ప్రశాంతంగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థుల భోజనం, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌వో తిరుమల తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై విద్యార్థులకు అవగాహన

భైంసాటౌన్: పట్టణంలోని గుజిరిగల్లి శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులకు తపాలాశాఖ అందిస్తున్న పథకాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పోస్టాఫీసు కార్యాలయం వద్దకు విద్యార్థులను తీసుకెళ్లారు. నాలుగో తరగతి విద్యార్థులకు 'మాటల ప్రయాణం' అనే పాఠ్యాంశంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్‌ఎం గంగాధర్ తెలిపారు. పోస్టాఫీస్ సిబ్బంది, విద్యార్థులు, ఆచార్యులు పాల్గొన్నారు.

సెలవుగా ప్రకటించాలి

భైంసాటౌన్: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఆరె మరాఠా సంఘం భైంసా గౌరవాధ్యక్షుడు జాదవ్ పుండ్లిక్‌రావు పాటిల్ పేర్కొన్నారు. శివాజీ జయంతి సందర్భంగా ఈనెల 19న రాష్ట్రప్రభుత్వం సెలవు ఇవ్వాలన్నారు. ఛత్రపతి జీవిత చరిత్ర భావితరాలకు తెలియాల్సిన అవసరముందని.. ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు.

ఎడారి బతుకులు



కాపరుల సామగ్రి మోసుకొస్తున్న ఒంటెలు

ముధోల్: పొట్టకూటి కోసం ఎల్లలు దాటి ముధోల్ మండల కేంద్రానికి చేరుకున్నారు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన గొర్రెల కాపరులు. ఆ రాష్ట్రంలో మేత దొరకకపోవడంతో గొర్రెలను తోలుకొని తెలంగాణకు వచ్చారు. దీంతోపాటు వారి సామగ్రి మోసుకొచ్చేందుకు ఒంటెలను కూడా తోడు తెచ్చుకున్నారు.

అన్ని సౌకర్యాలు కల్పించాలి

- నిర్మల్ ఆర్డీవో రత్నకళ్యాణి
- పలు పోలింగ్ కేంద్రాలు పరిశీలన



ఖానాపూర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీవో రత్నకళ్యాణి

ఖానాపూర్: పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్మల్ ఆర్డీవో రత్నకళ్యాణి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా కేంద్రంలో సౌకర్యాల కల్పనపై తహసీల్దార్ సుజాత, ఎస్సై రాహుల్ గైక్వాడ్‌తో చర్చించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. వార్షిక పరీక్షలంటే భయపడొద్దని.. ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఆమె వెంట అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కడెం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో రత్నకళ్యాణి మంగళవారం సందర్శించారు. కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందులో తహసీల్దార్ ప్రభాకర్, ఆర్‌ఐ తక్కన్న, ఎంసీ ఉమాజీ తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని నిర్మల్ ఆర్డీఓ రత్నకళ్యాణి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ దస్తురాబాద్ మండలంలో 175 పట్టభద్రుల ఓట్లు, 17 ఉపాధ్యాయుల ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు. తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎస్సై శంకర్, ఆర్‌ఐ గంగన్న, హెచ్‌ఎం కోట వేణు తదితరులు ఉన్నారు.

పెంబి: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో రత్నకళ్యాణి పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్, డీటీ శంకర్, ఆర్‌ఐ శత్రుఘున్ తదితరులు ఉన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

- ఒకటికి మించి నల్లా కనెక్షన్లు ఉండొద్దు
- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

భైంసాటౌన్: పట్టణవాసులు ఆస్తిపన్ను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని భైంసా మున్సిపల్ ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. మున్సిపల్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజేశ్‌కుమార్‌తో మాట్లాడి ఆస్తిపన్ను, ఇతర విషయాలపై అడిగి తెలుసుకున్నారు. ఆస్తి పన్ను, నల్లా పన్ను, ప్రకటన పన్నులు సకాలంలో చెల్లించాలని ప్రజలను కోరారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు పొందాలని, పాతవి రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఒక కుటుంబానికి ఒకటికి మించి నల్లా కనెక్షన్లు ఉండొద్దని తెలిపారు. ఉంటే మున్సిపల్ కార్యాలయంలో తెలపాలన్నారు. లేనిపక్షంలో సిబ్బంది వచ్చి తొలగించి చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

నర్సరీల్లో పందిళ్లు ఏర్పాటు చేయాలి

- డీఆర్డీవో విజయలక్ష్మి



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

లోకేశ్వరం: నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు ఎండిపోకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ, పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నర్సరీల్లో, పల్లె ప్రకృతివనంలో పెరిగిన పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. వీధుల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమేశ్, ఈవోపీఆర్డీ సల్మాన్‌రాజ్, ఏపీఓ జగనాథ్, ఈసీ అనిల్ ఉన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి



నర్సరీలో పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమేశ్

దస్తురాబాద్: ఉపాధిహామీ పథకం కింద ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని డీఎల్‌పీవో రమేశ్ సూచించారు. మంగళవారం మండలంలోని రేవోజీపేట గ్రామపంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా గ్రామపంచాయతీ రికార్డులు పరిశీలించి, డంపింగ్ యార్డు, నర్సరీ పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కార్యదర్శి గోవర్ధన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల్లో పనుల్లో పురోగతి ఉండాలని సూచించారు. ఎంపీడీవో రమేశ్, ఎంపీవో రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం



భైంసారూరల్ : ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

భైంసారూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షురాలు సిరం సుష్మారెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి ఆకాశ్ కోరారు. మంగళవారం మండలంలోని వాలేగాం, ఇలేగాం, కామోల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి బీజేపీ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. దిగంబర్, సాయినాథ్ పటేల్, సుభాశ్, కృష్ణ, మధుకర్, మహేందర్, రాకేశ్, శివప్రసాద్, గణేశ్, ముత్యం తదితరులు ఉన్నారు.

కుంటాల: బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మండల ఇన్‌చార్జులు పడకంటి సాయినాథ్, సాయి సూర్యవంశీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని విఠాపూర్, లింబా(కె) గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మనోహర్, నరేశ్, దత్తుపటేల్, మల్లేశ్, రమేశ్ పాల్గొన్నారు.

ప్రచారంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు

కుంటాల: టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ బలపరిచిన మల్క కొమరయ్యను గెలిపించాలని కోరుతూ మంగళవారం మండలంలోని రిటైర్డ్ ఉపాధ్యాయులు భైంసా, కుంటాల, కుభీర్ మండలాలకు చెందిన పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు జి.రమేశ్‌గౌడ్, మేసినేని నారాయణ్‌రావు, బి.రాంనాథ్ తదితరులు ఉన్నారు.

ఎడ్యుకేషనల్ రిసోర్స్ సెంటర్లకు కృషి



పట్టణంలో ప్రచారం చేస్తున్న అభ్యర్థి శేఖర్‌రావు

ఖానాపూర్: ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఆరేళ్లలో తనకు వచ్చే వేతనంతో మండల కేంద్రాల్లో పట్టభద్రుల ఎడ్యుకేషనల్ రిసోర్స్ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలో ఖానాపూర్ ట్రస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తిస్థాయి అవగాహన ఉందని.. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. అంతకుముందు పట్టణంలోని పలు చోట్ల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల ప్రభాకర్, ఖానాపూర్ డివిజన్ అధ్యక్షుడు పుప్పాల మల్లేశ్, ప్రధాన కార్యదర్శి విద్యాలత, ఉపాధ్యక్షులు సాంకేత్, రాష్ట్ర బాధ్యులు మనోహర్‌స్వామి, సభ్యులు శ్రీనివాస్, ప్రవీణ్, శంకర్, వెంకటేశ్, గంగారావు, శ్రీనివాస్‌రావు, వెంకటరమణ, లక్ష్మీనర్సయ్య తదితరులు ఉన్నారు.

గుడుంబా పట్టివేత

దస్తురాబాద్: మండలంలోని ఆకొండపేట గ్రామంలో మంగళవారం ఓ ఇంట్లో 10 లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. గుడుంబా అమ్ముతున్నారనే పక్కా సమాచారంతో తనిఖీ చేసి గ్రామానికి చెందిన రాంటెక్ మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది లక్ష్మణ్, సురేందర్ తదితరులు ఉన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన

ముధోల్: మండలంలోని తరోడా గ్రామపంచాయతీ పరిధి సేవాలాల్ తండాలో జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సేవాలాల్ గురు సంత్ ప్రేమ్ సింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన, హోమం చేపట్టారు. ఈ వేడుకలకు గిరిజనులు తరలిరాగా.. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గిరిజన పెద్దలను శాలువాతో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, రాజేశ్‌బాబు, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్, మాజీ సర్పంచ్ నరేందర్‌రాథోడ్ హాజరయ్యారు. అనంతరం మహా అన్నదానం ఏర్పాటు చేశారు.

కత్తిపోట్ల కలకలం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో సోమవారం అర్ధరాత్రి కత్తిపోట్ల కలకలం చోటు చేసుకుంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక గాజుల్‌పేట్ కాలనీకి చెందిన సాజిద్, షోయాబుద్దీన్ మధ్య ఇంటికి వెళ్లే దారి విషయంపై గొడవ జరిగింది. దీంతో సాజిద్‌పై షోయాబుద్దీన్, అతని తండ్రి బాబాఉద్దీన్, సోదరుడు ఇమ్రాన్ ముగ్గురు కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో తప్పించుకొని సాజిద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ముగ్గురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

సాగునీటి నాణ్యతపై అవగాహన

ముధోల్: మండలకేంద్రంలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో మంగళవారం సాగునీటి నాణ్యతపై రైతులకు భూగర్భజలశాఖ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయదారులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, భూగర్భజల వినియోగదారులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో భూగర్భ జల ఉప సంచాలకులు శ్రీనివాస్‌బాబు, వ్యవసాయ పరిశోధన స్థానం డాక్టర్ ఇ.నర్సయ్య, కె.విజయ్‌కుమార్, కార్తీక్, తదితరులున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గిరీశ్‌కుమార్ నాయనమ్మ సత్యం చిన్నక్క ఇటీవల మృతి చెందింది. మంగళవారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట ఆత్మ మాజీ చైర్మన్ సవ్వి అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్‌రావు పటేల్, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, నాయకులు ఖదీర్, కిష్టయ్య, శ్రీకర్‌రెడ్డి, శ్రీనివాస్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

మీసేవ నిర్వాహకుడిపై ఫిర్యాదు

పెంబి: మండలకేంద్రంలోని మీసేవ నిర్వాహకుడు నరేశ్ ధృవీకరణ పత్రాల కోసం ప్రభుత్వం నిర్ణయించిన దానికి కంటే రెండు రేట్లు ప్రజల నుంచి అదనంగా చార్జీలు వసూలు చేస్తున్నాడని మందపల్లి, నాగాపూర్ గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మీసేవ నిర్వాహకుడు సమయపాలన పాటించడం లేదన్నారు. ప్రతి దానికి నోటరీ అంటూ.. సర్టిఫికెట్ల కోసం వెళ్తే కాలయాపన చేస్తున్నాడని వాపోయారు. ఇప్పటివరకు నిర్వాహకుడిపై పలుమార్లు ఫిర్యాదు చేసిన సంబంధిత అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి మీసేవను సీజ్ చేయాలని కోరారు. ఇందులో డీటీ శంకర్, ఆర్‌ఐ శత్రుఘున్, ఫిర్యాదుదారులు వెంకటేశ్, రమేశ్‌రెడ్డి, కార్తీక్, ధర్మ, సాయన్న తదితరులున్నారు.

'స్పందన' సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

తానూరు: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి మంగళవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ లింగమూర్తి సూచించారు. మంగళవారం స్పందన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో భూ సమస్యలు, పొలాలకు వెళ్లే రోడ్ల సమస్యలుంటే లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సదరు దరఖాస్తులను రెవెన్యూ, పోలీసుశాఖ పరిశీలించి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి



ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో నాయకులు

కడెం: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మంగళవారం ఉట్నూర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. మండలకేంద్రంలో షాదిఖాన, ఖబ్రస్తాన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వివరించారు. ఇందులో జామా మసీద్, మహ్మదీయ మజీద్ అధ్యక్షులు వజీర్ ఉర్ రెహమాన్, వాజీద్‌ఖాన్, షర్ఫొద్దీన్, వసీహొద్దీన్, తదితరులు ఉన్నారు.

గిరిజనుల చదువులపై ప్రత్యేక దృష్టి

- డీటీడీవో అంబాజీ



విద్యార్థితో రాయిస్తున్న డీటీడీవో అంబాజీ

కడెం: గిరిజన విద్యార్థులు చదువులో వెనుకబడకుండా ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి(డీటీడీవో) అంబాజీ అన్నారు. మండలంలోని పాండ్వపూర్ పంచాయతీ పరిధిలోని గొందుగూడ గిరిజన ఆశ్రమ ప్రాథమిక పాఠశాలను డీటీడీవో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు పాఠాలు బోధించి వారితో అక్షరాలు, అంకెలు రాయించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల చదువు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పందుల కట్టడికి చర్యలు తీసుకోవాలి

దిలావర్‌పూర్: మండలకేంద్రంలో రోజురోజుకీ పందుల బెడద ఎక్కువ అవుతుందని.. వీటి కట్టడికి చర్యలు తీసుకోవాలని మంగళవారం గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు తహసీల్దార్ బి.స్వాతికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు బక్కన్న, రాజేశ్వర్‌రెడ్డి, కోడె నవీన్ మాట్లాడుతూ గ్రామంలోని వార్డులు, మహాపోచమ్మ ఆలయ పరిసరాల్లో పందులు సంచరిస్తూ ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. చిన్నారులపై దాడులు చేస్తున్నాయని.. పలుమార్లు పందుల యజమానులకు తెలిపినా పట్టించుకోవడంలేదని వాపోయారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు కట్కం రాజారెడ్డి, సల్ల మహిపాల్‌రెడ్డి, నడ్కుడ పోశెట్టి, బొల్ల దయాకర్, సప్పల నర్సయ్య, వినోద్ తదితరులు ఉన్నారు.

పట్టుదల, ప్రణాళికతో శ్రమిస్తే విజయం



ముధోల్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న మోహన్‌రావు

ముధోల్: విద్యార్థులు పట్టుదల, ప్రణాళికతో శ్రమిస్తే విజయం సొంతం అవుతుందని మోహన్‌రావుపటేల్ ప్రజాట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావుపటేల్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల తెలుగు, ఉర్దూ మీడియం, కేజీబీవీ, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ఎంజేపీ, రవీంద్ర హైస్కూల్, సరస్వతీ శిశుమందిర్ పాఠశాలల్లో చదువుతున్న 586 మంది పదో తరగతి విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ మోహన్‌రావు పరీక్ష ప్యాడులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పలువురు నాయకులు ఉన్నారు.

నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాధ

లక్ష్మణచాంద: సర్కారుబడుల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో రాధ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కాశిగూడ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను ఎంపీడీవో సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచడంతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ అమీర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు గొడుగులు పంపిణీ



గొడుగు అందిస్తున్న కిషన్‌రెడ్డి దంపతులు

ఖానాపూర్: పట్టణంలోని పాతబస్టాండ్ పరిధిలో 50 మంది వీధి వ్యాపారులకు మంగళవారం గొడుగులు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన గడ్డం సంధ్య–కిషన్‌రెడ్డి దంపతులు తమ కూతురు–అల్లుడి వివాహ వార్షికోత్సవం పురస్కరించుకుని కూరగాయలు అమ్మే రైతులతో పాటు తోపుడుబండ్ల వ్యాపారులకు గొడుగులు అందజేశారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు, పడాల ప్రభాకర్, జితేందర్, పడాల రాజశేఖర్, సల్ల జగన్, తిలక్‌రావు, రాంరెడ్డి, శంకర్, సంతోష్, వేణు, చిన్నా, రవి తదితరులు ఉన్నారు.

'ప్రశ్నించే గొంతుకలను గెలిపించండి'



ముధోల్‌లో మాట్లాడుతున్న జగన్‌మోహన్

ముధోల్: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా ప్రశ్నించే గొంతుకలను గెలిపించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఎస్పీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీగా ప్రసన్న హరికృష్ణ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా సాయన్నలను గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా మహిళా కన్వీనర్ లక్ష్మియాదవ్, మండలాధ్యక్షుడు శ్రీధర్, శైలజ, జ్యోతి, సావిత్రి తదితరులు ఉన్నారు.